సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 25 । జనవరి । 2023



వేయి కళ్లతో వేచి చూస్తున్నారు
పంచాయతీలకు ప్రత్యేక నిధులపై సీఎం కేసీఆర్ ఇటీవల చేసిన ప్రకటనతో సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 8లో



ఉత్తమ కార్మికుల ఎంపిక
సింగరేణి యాజమాన్యం ఉత్తమ కార్మికులను ఎంపిక చేసింది. గణత్రంత వేడుకల సందర్భంగా వీరిని సన్మానిస్తారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 17°
వాతావరణం
జిల్లాలో బుధవారం రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది. పగటి పూట కొద్దిగా ఎండ తీవ్రత ఉండవచ్చు.

న్యూస్‌రీల్

ఉత్తమ ఎన్నికల అధికారిగా కలెక్టర్ అనుదీప్



సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ ఉత్తమ ఎన్నికల అధికారి–2022 అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఈవిషయాన్ని మంగళవారం ప్రకటించారు. ప్రత్యేక ఓటరు సవరణ జాబితా, నూతన ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు చేర్పులు తదితర అంశాలపై చేసిన కృషి ఫలితంగా ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ నూతన ఓటరు నమోదులో భాగస్వాములైన ప్రజాప్రతినిధులను, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులను, సహాయఎన్నికల అధికారులను, బూతుస్థాయి అధికారులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రజాస్వామ్యం కల్పించిన ఓటుహక్కును అందరూ వినియోగించుకోవాలని కోరారు.

జిల్లా జడ్జిని కలిసిన డీఎంహెచ్‌ఓ



జిల్లా జడ్జి చంద్రశేఖర ప్రసాద్‌ను సన్మానిస్తున్న డీఎంహెచ్‌ఓ తదితరులు

కొత్తగూడెంటౌన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) జేవీఎల్ శిరీష మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువతో సన్మానించారు. న్యాయమూర్తితో పీసీపీఎన్‌డీటీ యాక్టుకు సంబంధించిన వివరాలపై జిల్లా కోర్టులో పని చేస్తున్న సిబ్బంది, అడ్వకేట్ల కోసం కంటివెలుగు కార్యక్రమం నిర్వహణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీవైఈఎంఓ ఎండీ ఫైజ్‌మొయిద్దీన్, హెల్త్ ఎడ్యూకేటర్ విజయ్‌కుమార్, కోర్టు అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

డీఈఓగా రవికాంతరావు..



నూతన డీఈఓ రవికాంతరావు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా విద్యాధికారిగా కె.రవికాంతరావును నియమిస్తూ రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ వాకాటి కరుణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లో ఎస్‌ఐఈటీ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు రానున్నారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న డీఈఓ సోమశేఖరశర్మను ఖమ్మం జిల్లాకు బదిలీ చేశారు. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు జరగనున్న నేపథ్యంలో ఈ బదిలీలు చేసినట్లు తెలుస్తోంది.

కేసులు సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ డాక్టర్ వినీత్ సూచించారు. మంగళవారం ఎస్పీ కార్యాయలంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్తులకు శిక్ష పడేలా చూడాలన్నారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్, బీట్స్ ద్వారా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని, బెట్టింగ్, మట్కా, గుట్కా, గంజాయి రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని అన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీఎస్పీలు వెంకటేశ్వరబాబు, రమణమూర్తి, రాఘవేంద్రరావు, సత్యనారాయణ, నందీ రామ్, సీఐలు పాల్గొన్నారు.

సుజాతనగర్: బాలికలు జగతికి వెలుగులని ఎస్పీ డాక్టర్ వినీత్ పేర్కొన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ధన్వంతరి ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా వేధించినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని బాలికలకు సూచించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ భాస్కర్, ట్రెజరర్ డాక్టర్ ఎస్ మోహన్ బాబు, వైస్ చైర్మన్ డాక్టర్ రాజ్యలక్ష్మి, డైరెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మనకూ... అమృత్ భారత్!

ఉమ్మడి జిల్లాలోని పలు స్టేషన్లకు స్థానం
- జాబితాలో కొత్తగూడెం, ఖమ్మం, మధిర
- ప్లాట్‌ఫామ్ మొదలు వెయిటింగ్ హాళ్ల వరకు అభివృద్ధి
- ఆధునిక సౌకర్యాల కల్పనకు సిద్ధమవుతున్న ప్రణాళిక



భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్లలో సౌకర్యాలు కల్పిస్తూ ఆధునీకీకరించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం అమృత్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టగా దశల వారీగా స్టేషన్లను ఎంపిక చేసి పనులు నిర్వహిస్తున్నారు. తాజాగా సికింద్రాబాద్ డివిజన్‌లో ఇరవై స్టేషన్లను ఎంపిక చేయగా, ఇందులో ఉమ్మడి జిల్లాలోని మూడు స్టేషన్లకు స్థానం లభించింది. ఈ పథకంద్వారా మూడు స్టేషన్లలో డ్రెయినేజీలు మొదలు మొదలు వై – ఫై వరకు అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది.

ప్లాట్‌ఫామ్స్
అమృత్ భారత్ పథకంలో ఎంపికైన స్టేషన్లలో ప్లాట్‌ఫారాలను ఆధునికీకరిస్తారు. ప్రస్తుతం ఈ స్టేషన్లలో ప్లాట్‌ఫామ్స్ ఎత్తు 76 సెం.మీ. ఉండగా దాన్ని 84 సెం.మీ.కు పెంచుతారు. ఫలితంగా రైలు ఎక్కడం, దిగడం మరింత సులువవుతుంది. గ్రాండ్ ట్రంక్ మార్గంలో ఉన్న ఖమ్మం, మధిర స్టేషన్లలో ప్లాట్‌ఫామ్స్ 24 బోగీల రైలు ఆగేందుకు అనువుగా సుమారు 600 మీటర్ల పొడవుతో ఉన్నాయి. ఎక్కడైనా ప్లాట్‌ఫామ్ పొడవు తక్కువగా ఉంటే వాటిని పెంచనున్నారు. ఇక కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో 18 నుంచి 21 బోగీలు రైలు నిలిపేందుకు అనువుగానే ప్లాట్‌ఫామ్స్ ఉండగా, 24 బోగీల రైలు నిలిపేందుకు వీలుగా తీర్చిదిద్దుతారు.

వెయిటింగ్ హాళ్లు
ఖమ్మం, మధిర, భద్రాచలంరోడ్డు స్టేషన్లలో సాధారణ ప్రయాణికులు, రిజర్వ్‌డ్, ఉన్నత శ్రేణి(ఏసీ) ప్రయాణికులకు వెయిటింగ్ హాళ్లు ఉన్నాయి. అయితే స్టేషన్‌లో స్థల లభ్యత ఆధారంగా అక్కడక్కడా ఉన్నాయి. అమృత్ భారత్‌లో భాగంగా అన్ని వెయిటింగ్ హాళ్లను ఒకే దగ్గర ఉండేలా నిర్మాణం చేపడుతారు. వీటికి దగ్గర్లోనే కేఫ్‌టేరియా ఉండేలా కొత్తగా స్టేషన్ డిజైన్ చేస్తారు. అంతేకాక టీసీల ప్రత్యేక వెయింగ్ హాల్ నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి.

మూడు స్టేషన్ల ఎంపిక..
బ్రిటీష్ కాలంలో నిర్మించిన రైల్వేస్టేషన్లను గడిచిన రెండు దశాబ్దాలుగా రైల్వే అభివృద్ధి చేస్తోంది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ప్రస్తుత ప్రయాణికుల అవసరాలు, అభిరుచులు దృష్టిలో ఉంచుకుని స్టేషన్లను పూర్తిగా ఆధునికీకరించాలని నిర్ణయించింది. దీని కోసం అమృత్ భారత్ పేరుతో కొత్త పథకాన్ని అమలు చేస్తూ, తొలి విడతలో దేశవ్యాప్తంగా వెయ్యి స్టేషన్లను అభివృద్ధికి సిద్ధమయ్యారు. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం), ఖమ్మం, మధిర రైల్వే స్టేషన్లు ఎంపికయ్యాయి. వీటిలో మధిర, ఖమ్మం స్టేషన్లు ముఖ్యమైన న్యూఢిల్లీ – చెన్నై గ్రాండ్ ట్రంక్ రూట్‌లో ఉండగా భద్రాచలం రోడ్ టెర్మినల్ స్టేషన్‌గా ఉంది.

ఫర్నిచర్ కూడా...
ప్రస్తుతం ప్లాట్‌ఫామ్స్, వెయిటింగ్ హాళ్లలో ఉన్న ఫర్నిచర్‌ను నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా మారుస్తారు. ప్రయాణికులు ఎదురుచూసే, కూర్చునే స్థలాల్లో మొబైల్ ఫోన్ల చార్జింగ్‌కు అనువుగా సాకెట్లు, హోల్డర్లు ఏర్పాటు చేస్తారు. అలాగే, రద్దీ ఆధారంగా మొబైల్ చార్జింగ్ ఏరియాను అందుబాటులోకి తెస్తారు. అవసరమైన చోట ప్రస్తుతం ఉన్న సిమెంట్ బెంచీలు, ఇనుప కుర్చీలకు బదులు కంఫర్టబుల్ మల్టీ యుటిలిటీ ఫర్నిచర్ ఏర్పాటు చేస్తారు.

పార్కింగ్.. ఇతర సౌకర్యాలు
ఎంపిక చేసిన స్టేషన్లలో పార్కింగ్ ఏరియాను కూడా పూర్తిగా ఆధునికీకరించి.. బస్ బే, ఆటో బేలను ఏర్పాటు చేస్తారు. స్టేషన్ ఆవరణలోని రావడం / వెళ్లే మార్గాలను సూచిస్తూ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తారు. స్టేషన్ ఆవరణలో లైటింగ్ వ్యవస్థ, గ్రీనరీని కూడా కొత్తగా డిజైన్ చేస్తారు. వీటితో పాటు అవసరమైన చోట రోడ్ల వెడల్పు, పాదచారులు నడిచేదారులు నిర్మిస్తారు. అంతేకాక స్టేషన్‌లో నిరుపయోగంగా ఉన్న కట్టడాలను తొలగించడంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థలో మార్పులు చేపడతారు. అలాగే, ఫ్లాట్‌ఫాంల సంఖ్యకు అనుగుణంగా ఎస్కలేటర్లు, తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు, డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు, టీవీలు ఏర్పాటు చేయబోతున్నారు. ఇంకా దివ్యాంగులకు సౌకర్యవంతంగా ఉండేలా రాకపోకల మార్గం, నిర్మాణం జరగనుంది.

వై – ఫై
ప్రస్తుతం రైల్వేలో ఇంటర్నెట్ ఆధారిత సేవలు గణనీయంగా పెరిగినందున స్టేషన్లలో వై – ఫైకి ప్రాధాన్యత పెరిగింది. ఇప్పటికే కొన్ని స్టేషన్లలో ఉచిత వై-ఫై సేవలు కొనసాగుతున్నా... అమృత్ భారత్‌లో భాగంగా ఎంపిక చేసిన స్టేషన్లలోప్రయాణికులు మెరుగైన 5జీ సేవలందేలా సౌకర్యాలు కల్పిస్తారు.

కమర్షియల్ జోన్లు
అమృత్ భారత్‌లో ఎంపికైన స్టేషన్ల ఆధునికీరణ కోసం ఇప్పటికే మాస్టర్ ప్లాన్లు సిద్ధం చేస్తున్నారు. ఎక్కడైనా భవనాల నిర్మాణం చేపట్టాల్సి వస్తే మొదటి అంతస్తు రైళ్ల రాకపోకలు, ప్రయాణికులు ఉపయోగించుకునేలా... రెండో అంతస్తు, ఆపై నిర్మాణాలను కమర్షియల్ ప్లాజాలుగా ఉపయోగించేలా మాస్టర్ ప్లాన్లు సిద్ధమవుతున్నాయి.

పనులు ఎందుకు పూర్తిచేయలేదు?

- ఇంజనీరింగ్ అధికారులపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం
- పునుకుల పాఠశాలలో 'మన బడి' పనుల పరిశీలన
- కోడిపుంజుల వాగులో నర్సరీ తనిఖీ



ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ అనుదీప్

పాల్వంచరూరల్: 'యూజ్‌లెస్ ఫెల్లోస్.. పనులను నిర్దేశించిన గడువులో ఎందుకు పూర్తి చేయడం లేదు. ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. చేతకాకపోతే తప్పుకోవాలి' అంటూ ఇంజనీరింగ్ అధికారులపై కలెక్టర్ అనుదీప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈడబ్ల్యూఐడీసీ (ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) డీఈ ఆశీర్వాదం, ఏఈ రాజగోపాల్‌పై మండిపడ్డారు. మండల పరిధిలోని పునుకుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.7 లక్షలు, ఈజీఎస్ నిధులు రూ.19 లక్షలు.. మొత్తం రూ. 26 లక్షలు గత జూన్‌లో మంజూరయ్యాయి. వీటితో పాఠశాలలో మరమ్మతులు, టాయిలెట్లు, మూత్రశాలలు నిర్మించాల్సిఉంది. పనులు ఇంకా అసంపూర్తిగానే ఉండటంతో కాంట్రాక్టర్‌ను, పర్యవేక్షణ చేస్తున్న డీఈ, ఏఈలను ప్రశ్నించారు. త్వరలోనే పూర్తి చేస్తామని సమాధానం చెప్పడంతో డీఈ, ఏఈలపై సీరియస్ అయ్యారు. కాంట్రాక్టర్‌తో పనులు చేయించడం చేతకాకపోతే బాధ్యతల నుంచి తప్పుకోండంటూ హెచ్చరించారు. ఇంకా జాప్యం చేస్తే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. మెమో ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాల ప్రాంగణంలో పారిశుద్ధ్యం లోపం ఉండటంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌ని, అధికారులను ఆదేశించారు. కనీసం విద్యుత్ పైపులైన్ కూడా సక్రమంగా నిర్మించలేదన్నారు. పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక ఆడిటోరియం నిర్మించాలని సూచించారు. గ్రీనరీ పెంచాలని సూచిస్తూ, మొక్కలు ఎలా వరుస క్రమంలో నాటాలో డ్రాయింగ్ వేసి హెచ్‌ఎం ఉషారాణికి, అధికారులకు వివరించారు. మళ్లీ తాను పాఠశాల సందర్శనకు వచ్చినప్పుడు అంత గ్రీనరీగా కన్పించాలని చెప్పారు.

కోడిపుంజులవాగు నర్సరీలో తనిఖీ
మండల పరిధిలోని కోడిపుంజులవాగు గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని మంగళవారం కలెక్టర్ అనుదీప్ తనిఖీ చేశారు. మొక్కలను పరిశీలించి మొలకలు రాని విత్తనాల స్థానంలో కొత్తవి నాటాలని సూచించారు. డంపింగ్ యార్డును పరిశీలించి వేస్ట్ మెటీరియల్‌ను వెంటనే విక్రయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డంపింగ్ యార్డులో రోజూ సెగ్రిగేషన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, సీఈఓ విద్యాలత, డీపీఓ రమాకాంత్, జెడ్పీ సీఈఓ విద్యాలత, ఎంపీడీఓ జి.రవీంద్రప్రసాద్, ఎంపీఓ.బి.నారాయణ, ఎంఈఓ శ్రీరామ్మూర్తి, ఏపీఓ రంగా, ఏపీఎం రాంబాబు, సర్పంచ్ తేజావత్ సక్రు తదితరులు పాల్గొన్నారు.

వనరులు సద్వినియోగం చేసుకోవాలి
పాల్వంచ: విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న వనరులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో రికార్డులు, మరుగుదొడ్లు పరిశీలించి మాట్లాడారు. అనంతరం ప్రశాంత్ నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు–మన బడి పనులను తనిఖీ చేశారు. ఈ నెల 31 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, సీఈఓ విద్యాలత, డీపీఓ రమాకాంత్, జెడ్పీ సీఈఓ విద్యాలత, అనసూర్య, ఎంపీడీఓ జి.రవీంద్రప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, ఇతర అధికారులు నారాయణ, శ్రీరామ్మూర్తి, శివ భాస్కర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు
ములకలపల్లి: జాతీయ, రాష్ట్రస్థాయిలో క్రీడా, కళల్లో ప్రతిభ చూపిన మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల విద్యార్థినులు కే.ప్రణీత, జి.మైత్రీ , కే.పల్లవిని, ప్రిన్సిపాల్ సునీతను కలెక్టర్ అనుదీప్ తన కార్యాలయంలో అభినందించారు.

ఐడీఓసీలోనే గణతంత్ర వేడుకలు..



గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కలెక్టరేట్(ఐడీఓసీ)లోనే గణతంత్ర వేడుకలను నిర్వహించనున్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీఆర్వో అశోకచక్రవర్తితో కలిసి ఆయన ఐడీఓసీ కార్యాలయంలో చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఉదయం 9 గంటల వరకు ఐడీఓసీకి చేరుకోవాలని అన్నారు. డీఈఓ సోమశేఖర శర్మ పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి
నిర్దేశించిన 46 మోడల్ పాఠశాలలను ఈనెలాఖరు నాటికి అన్ని హంగులతో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కలెక్టర్ అనుదీప్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం విద్య, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఐడీసీ, గిరిజన ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కలెక్టరేట్ ఏఓ గన్యా, పాల్వంచ తహసీల్దార్ రంగాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

రూ.వెయ్యితో బతికేదెట్టా..?

- అరకొర వేతనాలతో కార్మికుల అవస్థ
- మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపుల్లో జాప్యం
- పెరిగిన ధరలతో గుడ్డు వడ్డించలేని పరిస్థితి
- కొరవడిన విద్యాశాఖ పర్యవేక్షణ



వంటషెడ్లలో నిరసన తెలుపుతున్న వర్కర్లు

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికులు అరకొర వేతనాలతో అవస్థ పడుతున్నారు. బిల్లులు సకాలంలో రావడం లేదని వాపోతున్నారు. ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించలేని పరిస్థితి నెలకొంది. దీంతో చిన్నారులు ఇళ్ల నుంచే లంచ్ బాక్స్‌లు తెచ్చుకుంటున్నారు. విద్యాశాఖ అధికారులు కూడా ఎప్పుడో ఒకసారి తప్ప నిరంతరం పర్యవేక్షించడం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం చెల్లిస్తున్న రేటుతో గుడ్డు వడ్డించలేకపోతున్నామని వర్కర్లు పేర్కొంటున్నారు. ఇప్పటికే జిల్లాలో 60 శాతం వరకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో గుడ్డు వడ్డించడం లేదు. ప్రధానోపాధ్యాయులు కూడా ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా, గతంలో లాగా స్నాక్స్ ఇవ్వడంలేదు. దీంతో విద్యార్థులు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు.

చాలీచాలని వేతనాలు
ప్రస్తుతం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వండే కార్మికులకు నెలకు రూ.1000 చొప్పున వేతనం ఇస్తున్నారు. గతేడాది అసెంబ్లీ సమావేశాల్లో వేతనాలను రూ.3 వేలకు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. కానీ ఇంతవరకు అమలు చేయలేదు. పెరుగుతున్న ధరలకు, స్వల్ప వేతనాలకు పొంతన లేక వర్కర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం గుడ్డుకు రూ.5 చెల్లిస్తుండగా, మార్కెట్‌లో ధర రూ.7 పలుకుతోంది. మరోవైపు బిల్లుల చెల్లింపుల్లో కూడా తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో గుడ్డు వడ్డించలేకపోతున్నామని కార్మికులు చెబుతున్నారు. గతేడాది ఆగస్టు నుంచి బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొంటున్నారు. పెంచిన వేతనాలు అమలు చేయాలని, గడ్డు, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని కార్మికులు గత నెల 26 నుంచి ఆందోళన చేపడుతున్నారు. పాఠశాలల్లోని వంట షెడ్లలో కార్మికులు నల్లబ్యాడ్జీలు పెట్టి నిరసన తెలుపుతున్నారు. ఈ నెల 28న స్థానిక ఎమ్మెల్యేలకు, ఎంఈఓ, డీఈఓకు సమస్యలపై వినతిపత్రాలు అందజేయనున్నారు.

అప్పుల పాలయ్యారు..



మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారానికి గత నెల 26 నుంచి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాం. కార్మికులు అప్పులు తెచ్చి గుడ్లు కొనుగోలు చేసి వడ్డించారు. బిల్లులు రాకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయారు.
– విజయలక్ష్మి, వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

వేతనాలు, బిల్లులు రాట్లే..



సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌ను, ఎమ్మెల్యేలను, డీఈఓను త్వరలో కలుస్తాం. ప్రభుత్వమే గుడ్లు సరఫరా చేస్తే బాగుంటుంది. వేతనాలు రాక, పెట్టిన డబ్బులకు బిల్లుల రాక సతమతమవుతున్నాం.
– పుష్ప, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

బిల్లులు పెండింగ్‌లో లేవు



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో లేవు. ప్రభుత్వం విడుదల చేయగానే బిల్లులు చేసి వర్కర్లకు చెల్లిస్తున్నాం. విద్యార్థులకు గుడ్డును తప్పనిసరిగా వడ్డించాలి.
– జ్యోతి, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్

రామయ్య నిత్యకల్యాణం..

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేత, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంత రం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరించారు. మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తొలిరోజు జేఈఈ ప్రశాంతం

సుజాతనగర్: అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో తొలిరోజు మంగళవారం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. రెండు సెషన్లలో 92 మందికి ఆరుగురు గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులను పరీక్షా సమయానికి అరగంటే ముందుగానే అనుమతించారు.



హాల్ టికెట్ పరిశీలిస్తున్న సిబ్బంది

అస్త్రశస్త్రాలు రెడీ !

- జిల్లాలో ముందస్తు ఎన్నికల వేడి
- పోరుకు సై అంటున్న నేతలు, ఆశావహులు
- టికెట్లే లక్ష్యంగా పోటాపోటీ కార్యక్రమాలు
- విమర్శలు, ప్రతివిమర్శలతో వేడెక్కుతున్న వాతావరణం



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ముందస్తు ఎన్నికలు వస్తాయన్న ప్రచారం నేపథ్యాన ఉమ్మడి జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఆశావహులు జోరు పెంచారు. నియోజకవర్గాల్లో పోటాపోటీగా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతోపాటు అనుచరులతో సమావేశమవుతూ భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు చేస్తున్నారు. భారీ సభ నిర్వహించడం ద్వారా బీఆర్‌ఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయ వేడిని రగలగా... కమ్యూనిస్టులు కూడా నిత్యం ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇక కాంగ్రెస్ సత్తా చాటేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధం చేస్తోంది. ఈనెల 26 నుంచి హాథ్ సే హాథ్ జోడో' పేరుతో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క యాత్ర చేపట్టాలని నిర్ణయించారు. ఇంకోపక్క బీజేపీ కూడా అదే బాటలో పయనిస్తోంది. ఇదిలా ఉండగా టికెట్లు ఆశిస్తున్న పార్టీల్లోని నేతలు కదనరంగంలోకి దూకుతూ... నిత్యం ప్రజల్లో ఉండేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నారు.

కొత్త సంవత్సరంలో మారిన ముఖచిత్రం
కొత్త సంవత్సరం మొదలైన రోజు నుంచే ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ముందస్తు ఎన్నికలు వస్తాయనే ఊహాగానాలతో నేతలు ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలో నేతలు చేసిన వాడీవేడి ప్రసంగాలు రాజకీయ కాక పెంచాయి. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా పోటీ చేయాలనే ఉద్దేశంతో ఉన్న నేతలు దూకుడుగా వ్యవహరిస్తున్నారు. అవసరమైతే తమ దారి తాము చూసుకుంటామనే సంకేతాలను ఇచ్చేశారు. ఇదే సమయాన ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యాన బీఆర్‌ఎస్ తొలి సభను ఖమ్మంలో నిర్వహించనున్నట్లు ప్రకటించడం... ఈ సభకు మరో ముగ్గురు ముఖ్యమంత్రులు హాజరుకావడంతో ఈనెల మొదటి పక్షమంతా అదే హడావుడి కనిపించింది.

'వాడ వాడకు పువ్వాడ'తో..
ఈనెల 1వ తేదీ నుంచి రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ 'వాడవాడకు పువ్వాడ' కార్యక్రమం ప్రారంభించారు. వారంలో ఒకటి, రెండు రోజులు ఖమ్మంలోని డివిజన్లలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వారితో మమేకమయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను వివరించడమే కాక తన హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తున్నారు. అదే సమయాన పలు అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపన చేస్తున్నారు.

పొంగులేటి 'ఆత్మీయ' బాట..
ఇక మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వరం మరింత పెంచారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు బీఆర్‌ఎస్‌లో సంచలనం రేపగా... పినపాక, ఇల్లెందు నియోజకవర్గాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి పార్టీపై అసంతృప్తిని బాహాటంగానే వెలిబుచ్చారు. మిగతా నియోజకవర్గాల్లోనూ ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఈక్రమంలో ఆయన పార్టీ మారడం ఖాయమనే ప్రచారం జరుగుతుండగా.. ఏ పార్టీలోకి వెళ్తారనేది రాజకీయంగా ఉత్కంఠ కలిగిస్తోంది.

పోటాపోటీగా..
ఉమ్మడి జిల్లాలోని సిట్టింగ్ ఎమ్మెల్యేలతోపాటు ఆశావహులు కూడా ప్రజామద్దతు కూడగట్టుకునేందుకు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ ఆత్మీయ సమావేశం నిర్వహించి.. రాజకీయ ప్రత్యర్థులపై విరుచుకుపడ్డారు. అలాగే పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కార్యకర్తలతో భేటీ అవుతూనే పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలతో మమేకమవుతున్నారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా తన అనుచరులతో సమావేశమయ్యారు. మరికొందరు నేతలు సైతం రానున్న ఎన్నికలే లక్ష్యంగా కార్యకర్తలతో భేటీ అవుతుండడంతో ప్రజల్లో ఉండేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

కాంగ్రెస్‌లో కదలిక..
ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ కూడా జోరు పెంచేలా కార్యక్రమాలను రూపొందిస్తోంది. ఈనెల 26 నుంచి 'హాథ్ సే హాథ్ జోడో' పేరుతో యాత్ర చేపట్టేందుకు యత్నాలు జరుగుతున్నాయి. ఈయాత్రను ఉమ్మడి జిల్లాకు చెందిన సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపడతారనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తన పాదయాత్ర భద్రాచలం నుంచి ప్రారంభిస్తారనే ఊహాగానాలు సాగుతున్నాయి. ఇలా ప్రతీ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ నేతలు కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఇతర పార్టీల్లోనూ జోష్
ఈ పార్టీలతోపాటు బీజేపీ, కమ్యూనిస్టుల్లోనూ ఎన్నికల జోష్ కనిపిస్తోంది. సీపీఐ, సీపీఎం వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో జత కట్టే సూచనలు కనిపిస్తుండగా.. ఉమ్మడి జిల్లాకే చెందిన ఇరు పార్టీల రాష్ట్ర కార్యదర్శులు విస్తృత పర్యటనలు చేస్తున్నారు. బీఆర్‌ఎస్ తొలి ఆవిర్భావ సభలోనూ సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజాతోపాటు వీరిద్దరు పాల్గొన్నారు. మరోవైపు బీజేపీ జిల్లాలో పట్టు సాధించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. వచ్చే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను పోటీ చేయించి అత్యధిక సీట్లు సాధించాలనే లక్ష్యంతో పార్టీ అధిష్టానం జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించింది.

క్లుప్తంగా

కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గిరిజన వసతి గృహాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, దినసరి కార్మికులు ఖాళీ కంచాలతో హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ మాట్లాడారు. ఔట్ సోర్సింగ్, దినసరి కార్మికుల వేతనాల విడుదలకు ఉన్న అడ్డంకులన్నింటినీ వెంటనే పరిష్కరించి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వర్కర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు మాట్లాడుతూ కార్మికుల ఆకలి బాధలు సీఎం కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. వేతనాల సమస్య పరిష్కారమయ్యేంత వరకు నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కె.బ్రహ్మచారి, రత్నం రాజేందర్, పాయం ముత్తయ్య, రాములు, జలంధర్, ఈసం పద్మ, లక్ష్మణ్‌నాయక్, తిరుపతమ్మ, కాకా సమ్మక్క, భద్రమ్మ, జోడ లక్ష్మీ, రామారావు, రాము, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో ఆర్టీఓ తనిఖీలు



పట్టుకున్న లారీతో ఆర్టీఓ తిరుపతి

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని రైల్వేగేట్ కూనవరం వద్ద మంగళవారం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) తిరుపతి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతం నుంచి వెళ్తున్న బొగ్గు లారీలు, మట్టి తోలుతున్న టిప్పర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ధ్రువపత్రాలు, లైసెన్స్‌లను తనిఖీ చేశారు. అధిక లోడ్‌తో వెళ్తున్న రెండు బొగ్గు టిప్పర్లు, ఒక మట్టి టిప్పర్‌ను పట్టుకొని జరిమానా విధించారు.

చిట్‌ఫండ్ కార్యాలయానికి తాళం



ఆందోళన చేస్తున్న బాధితులు

పాల్వంచ: పట్టణంలోని ఓ చిట్ ఫండ్‌లో చిట్టి పాట పాడుకున్నా సకాలంలో డబ్బులు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారంటూ బాధితులు మంగళవారం ఆందోళనకు దిగారు. నటరాజ్ సెంటర్‌లోని చిట్ ఫండ్ కార్యాలయం వద్దకు కొందరు బాధితులు చేరుకుని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అనంతరం కార్యాలయానికి తాళాలు వేశారు. చిట్స్ వేస్తే రకరకాల ఆఫర్లు ఉన్నాయంటూ నమ్మబలికారని, చిట్టీ పాడి నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తుండటంతో తాము ఇబ్బందులు పడుతున్నామని, తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన చేస్తామని, తాళాలు కూడా తీయనీయమని హెచ్చరించారు.

'ఇల్లు అమ్ముతానని మోసం చేశారు'



ఇంటిఎదుట బైఠాయించిన సర్వేశ్ దంపతులు

భద్రాచలంఅర్బన్: ఇల్లు అమ్ముతానని డబ్బు తీసుకుని మాట తప్పడమే కాక, అద్దె ఇంటి నుంచి కుటుంబాన్ని గెంటేసిన ఘటన ఇది. భద్రాచలం జగదీశ్‌కాలనీలోని ఓ ఇల్లు అద్దెకు ఇవ్వనున్నట్లు తెలియడంతో ఏడూళ్ల బయ్యారానికి చెందిన సర్వేశ్–రాజేశ్వరి తమపిల్లలతో కలిసి రాగా, ఆ ఇంటి ఎదురుగా ఉన్న కాటబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడి అద్దెకు ఇచ్చాడు. అంతేకాక ఇల్లు అమ్మనున్నట్లు చెప్పడంతో వెంకటేశ్వర్లుకు సర్వేశ్ రూ.5 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. అయితే, ఇంటి పత్రాలు మరొకరి పేరిట ఉండడంతో అడగగా, వారు పంజాబ్‌లో ఉంటారు? వచ్చాక సంతకాలు పెడతారని చెప్పాడు. దీంతో ఖంగుతిన్న సర్వేశ్ తమకు ఇల్లు వద్దు, డబ్బు ఇచ్చేయాలని కోరగా బెదిరించడం మొదలుపెట్టారు. ఇంతలోనే ఓ పార్టీ నేత కూడా బెదిరించడంతో పాటు మంగళవారం ఉదయం సర్వేశ్ ఇంట్లో సామగ్రిని బయటపడేసి గెంటేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ సర్వేశ్ దంపతులు అక్కడే బైఠాయించారు. విషయం తెలుసుకున్న టౌన్ ఎస్‌ఐ శ్రీకాంత్ చేరుకుని వివరాలు ఆరా తీశారు. అనంతరం రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కాటబోయిన వెంకటేశ్వర్లుతోపాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

వేయి కళ్లతో వేచి చూస్తున్నారు..

సీఎం నిధులపై సర్పంచ్‌ల ఆశలు

- జీపీకి రూ.10 లక్షలు ప్రకటించిన సీఎం కేసీఆర్
- గ్రామ పంచాయతీలకు ఆర్థికంగా భరోసా
- త్వరలోనే నిధులు వస్తాయంటున్న అధికారులు



ప్రశాంతినగర్ గ్రామపంచాయతీ కార్యాలయం

చుంచుపల్లి: సీఎం ఇటీవల గ్రామ పంచాయతీలకు ప్రకటించిన ప్రత్యేక నిధులపై సర్పంచులు ఆశలు పెట్టుకున్నారు. చాలాకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న గ్రామ పంచాయతీలను ఈ ప్రత్యేక నిధులు ఆదుకుంటాయని ఎదురుచూస్తున్నారు. ఈ నెల 12న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటనకు రావటం స్థానిక సంస్థలకు మరింతగా కలిసొచ్చిందని భావిస్తున్నారు. కొత్త కలెక్టరేట్ భవన సముదాయాల ప్రారంభోత్సవానికి కొత్తగూడెం వచ్చిన సందర్భంగా ఆయన జిల్లాలోని ప్రధాన మున్సిపాలిటీలతో పాటు గ్రామ పంచాయతీలకు భారీగా నిధులను ప్రకటించారు. జిల్లాలోని ప్రధాన మున్సిపాలిటీల్లో కొత్తగూడెం, పాల్వంచలకు ఒక్కొక్క మున్సిపాలిటీకి రూ.40 కోట్ల చొప్పున, మణుగూరు, ఇల్లెందు మున్సిపాలిటీలకు సైతం రూ.25 కోట్ల చొప్పున తన సొంత నిధుల్లో నుంచి ఇస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని మొత్తం 4 మున్సిపాలిటీలకు కలిపి రూ.130 కోట్లను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 481 గ్రామ పంచాయతీలకు కూడా వరాలు కురిపించారు. గ్రామాలు పరిపాలనా పరంగా ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో ఒక్కో పంచాయతీకి రూ.10 లక్షల చొప్పున సీఎం ప్రత్యేక నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. 2019 నుంచి ఆర్థిక సంఘం నిధులు తప్ప వేరే ఆదాయ మార్గాలు లేక పాలనాపరమైన ఇబ్బందులు పడుతున్న గ్రామాలకు ఈ నిధులు ఆర్థిక భరోసాగా నిలవనున్నాయని పాలకవర్గాలు అంటున్నాయి. ఇప్పటివరకు గ్రామపంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు కాకుండా సీఎం ప్రత్యేక నిధులు ప్రకటించడం ఇదే ప్రథమం. ఈ నిధులను స్వయంగా సర్పంచులే దగ్గరుండి అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలని సీఎం సూచించడంతో వారందరూ ప్రత్యేక నిధుల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

నిధులొస్తే పంచాయతీలకు ఊరట

జిల్లాలోని 481 గ్రామపంచాయతీల్లో 276 పంచాయతీలు కొత్తగా ఏర్పడగా, అందులో దాదాపు 200 వరకు చిన్న పంచాయతీలుగా కొనసాగుతున్నాయి. పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు నెలకు రూ.10.32 కోట్ల చొప్పున విడుదలవుతాయి. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు గత సంవత్సరం ఆగస్టు వరకు మాత్రమే విడుదల కాగా, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు ఇప్పుడిప్పుడే దఫాల వారీగా జీపీల ఖాతాల్లో జమవుతున్నాయి. అరకొరగా వచ్చే ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీలకు ఎటూ సరిపోవడం లేదు. జనాభా ప్రాతిపదికన వీటిని గ్రామ పంచాయతీలకు కేటాయిస్తుండటంతో చిన్న పంచాయతీల్లో పాలన మరింత దయనీయంగా మారింది. చిన్న పంచాయతీలకు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు మాత్రమే ఈ నిధులు వస్తున్నాయి. ఇవి ట్రాక్టర్ల కిస్తీలు, డీజిల్ ఖర్చులు, కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లులకే సరిపోతున్నాయి. ఇక అభివృద్ధి పనులు చేపట్టాలంటే ఆర్థికంగా వెసులుబాటు ఉండటం లేదు. దీంతో చిన్న పంచాయతీల్లో పాలన కుంటుపడుతోంది. పెద్ద పంచాయతీలకు ఇంటి పన్నులతో పాటు ఇతర ఆర్థిక వనరులు ఉండటంతో కలిసి వస్తోంది. అయితే ఆర్థిక సంఘం నిధులు సరైన సమయంలో రాకపోవడంతో సర్పంచులు బయట నుంచి అప్పులు తేవాల్సిన పరిస్థితి వస్తోంది. గ్రామ పంచాయతీలకు గడిచిన నాలుగేళ్లుగా దండిగా నిధులు విడుదల కాకపోవడంతో పాలకవర్గాలు పాలనాపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పల్లెప్రగతిలో భాగంగా గతంలో సర్పంచులు చేపట్టిన అభివృద్ధి పనులకు రూ.లక్షల్లో బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి విషయంలో ఇప్పటికే సర్పంచులు ఆర్థికంగా సతమతమవుతున్నారు. ఈ తరుణంలో జిల్లాకు వచ్చిన సీఎం కేసీఆర్ గ్రామ పంచాయతీలకు వరాలు కురిపించటం కొంత ఊరట కలిగించింది. సీఎం ప్రత్యేక నిధుల నుంచి ఒక్కొక్క పంచాయతీకి రూ.10 లక్షలు కేటాయించడంతో జిల్లాలోని మొత్తం 481 గ్రామపంచాయతీలకు రూ.4.81 కోట్లు త్వరలో రానున్నాయి. ఇవి గ్రామాలకు ఆర్థికంగా అండగా నిలవనున్నాయని సర్పంచులు భావిస్తున్నారు. వీటి ద్వారా గ్రామాల్లో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, మంచినీటి వనరులతో పాటు ఇతరత్రా పనులకు వినియోగించుకునే వీలుంటుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ స్థానిక సంస్థలకు ప్రకటించిన నిధుల కోసం గ్రామ సర్పంచులు ఎదురుచూస్తున్నారు.

సీఎం నిధులు ప్రకటించడం అదృష్టం



ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామ పంచాయతీలకు నిధులు ప్రకటించడం అదృష్టంగా భావిస్తున్నాం. ముఖ్యంగా చిన్న పంచాయతీలకు ఈ నిధులు ఎంతగానో దోహదపడతాయి. పాలనాపరమైన ఇబ్బందులు రాకుండా స్వయంగా ముఖ్యమంత్రి తన ప్రత్యేక నిధులను ఇవ్వడం గొప్ప విషయం. ఆయన కొత్తగూడెం పర్యటనకు రావడం అదృష్టంగా భావిస్తున్నాం. ఈ నిధులు వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నాం.

– బానోత్ రాందాస్, సర్పంచ్, ధన్‌బాద్

గ్రామాలకు ఆర్థిక భరోసా



సీఎం కేసీఆర్ గ్రామ పంచాయతీలపై కనికరం చూపారు. నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న గ్రామాలకు రూ.10 లక్షలు ఇవ్వడం ఆర్థిక భరోసాగా నిలవనుంది. ఈ నిధులతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించే అవకాశం ఉంటుంది. అధికారులు త్వరతగతిన విడుదల చేసి ఆదుకోవాలి.

– జ్ఞానమూర్తి సరిత, సర్పంచ్, రామాంజనేయకాలనీ

త్వరలో నిధులొచ్చే అవకాశం



సీఎం కేసీఆర్ కొత్తగూడెం పర్యటనకు వచ్చిన సందర్భంగా స్థానిక సంస్థలకు భారీగా వరాలు కురిపించారు. సీఎం ప్రత్యేక నిధులు ప్రకటించడం గ్రామపంచాయతీలకు భరోసాగా నిలిచింది. ముఖ్యంగా చిన్న పంచాయతీలకు ఈ భారీ నిధుల కేటాయింపు ఎక్కువగా దోహదపడనున్నాయి. సీఎం ప్రకటించిన ఈ నిధులు త్వరలోనే విడుదలయ్యే అవకాశం ఉంది.

– రమాకాంత్, జిల్లా పంచాయతీ అధికారి

బాలికల విషయంలో పురోగతి సాధించాం..

కలెక్టర్ దురిశెట్టి అనుదీప్



చిన్నారికి మెమెంటో అందిస్తున్న కలెక్టర్ దురిశెట్టి అనుదీప్

కొత్తగూడెంటౌన్: 'బాలికలు వద్దు'అనే స్థితి నుంచి బాలికలు ముద్దు అనే స్థాయికి పురోగతి సాధించామని జిల్లా కలెక్టర్ అనుదీప్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో మహిళా శిశు, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ అనుదీప్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, మాట్లాడారు. సమాజంలో అమ్మాయిల పట్ల వివక్ష తగదని, ఆడపిల్ల పుడితే భారంగా భావించే సమాజం నుంచి ఆడపిల్లే కావాలని కోరుకునేంత పురోగతి సాధించామని తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవం రోజున ఆడపిల్ల పట్ల వివక్ష చూపమని ప్రతిజ్ఞ చేసి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. క్రీడలు, కరాటే, నృత్య పోటీల్లో రాణిస్తున్న విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనీనా, సీడీపీఓలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి జైలుశిక్ష..

కొత్తగూడెంటౌన్: అతిగా మద్యం తాగి వాహనాలను నడుపుతూ పట్టుబడిన షేక్ కరీముల్ల, మడకం సందీప్‌లకు రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్(ఎఫ్‌ఏసీ), సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ బత్తుల రామారావు మంగళవారం తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు ఇలా ఉన్నాయి.. లక్ష్మీదేవిపల్లి పరిధిలోని చాతకొండ క్రాస్ రోడ్డు వద్ద లక్ష్మీదేవిపల్లి పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జె.ప్రవీణ్ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో అతిగా మద్యం సేవించి లారీ నడుపుతున్న, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంనకు చెందిన షేక్ కరీముల్లా, మోటార్ సైకిల్ నడుపుతున్న మోరంపల్లిబంజర్ వేపలగడ్డకు చెందిన మడకం సందీప్ పట్టుబడ్డారు. వారు అత్యధికంగా మద్యం సేవించినట్లు రుజువైనందున కోర్టులో హాజరు పరిచారు. విచారణలో వారు నేరం ఒప్పుకోగా కరీముల్ల, మడకం సందీప్‌లకు రెండు రోజుల జైలుశిక్షను విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. కోర్టు పీసీ పర్శ రామకృష్ణ సహకరించారు.

బాలికల సంరక్షణకు పాటుపడాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



మాట్లాడుతున్న జి.భానుమతి

సింగరేణి(కొత్తగూడెం): బాలికల సంరక్షణ కోసం అందరూ పాటుపడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి సూచించారు. మంగళవారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆడపిల్లలపై ప్రత్యేక దృష్టి సారించే దిశగా భారత ప్రభుత్వం నేషనల్ గర్ల్స్ డెవలప్‌మెంట్ మిషన్ పేరుతో కార్యక్రమం రూపొందించిందని, అందులో భాగంగా 2008లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంప్రసాద్‌రావు, కటికం పుల్లయ్య, లక్కినేని సత్యనారాయణ, తోట మల్లీశ్వరరావు, మెండు రాజమల్లు, ఎండీ సాధిక్‌పాషా, మునిగడప వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నా భర్తను అన్యాయంగా పొట్టనపెట్టుకున్నారు..



మాట్లాడుతున్న హచ్చు కుటుంబీకులు

టేకులపల్లి: మండలంలోని బీఆర్‌ఎస్ నాయకుడి ప్రోద్బలంతో ఎస్‌ఐ, సీఐలు వేధించడంతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని బాదావత్ అచ్చమ్మ ఆరోపించారు. మంగళవారం టేకులపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడారు. తమ కుమారుడు నరేశ్ టేకులపల్లిలోని ఎస్టీ హాస్టల్‌లో ఉంటూ ప్రభుత్వ కాలేజీలో ఇంటర్ చదువుతుండగా, కోయగూడెం గ్రామానికి చెందిన బాలికను ఈ నెల 11న తీసుకెళ్లాడని తెలిపారు. ఈ విషయాన్ని బీఆర్‌ఎస్ నాయకుడు చీమల సత్యనారాయణ చెప్పగా, 16వ తేదీన బాలికను తీసుకొచ్చి పోలీసుస్టేషన్‌లో కుటుంబ సభ్యులకు అప్పగించామని చెప్పారు. అయితే, బాలికను తీసుకెళ్లిన తన కొడుకుపై కాకుండా ఐదుగురు కుటుంబీకులపై కేసు నమోదు చేసి ఈనెల 22వ తేదీ వరకు స్టేషన్‌కి పిలిపించి హింసించారని ఆరోపించారు. అప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న తన భర్త హచ్చు (45) పోలీసుల వేధింపుల కారణంగా 23న పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఇప్పుడు తన కుమారుడు కూడా తండ్రి వద్దకే పోతానని అంటున్నాడని, ఈ ఘటనలో ఉన్నతాధికారులు స్పందించి కారకులైన నేతతో పాటు ఎస్‌ఐ, సీఐలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హచ్చు కుటుంబ సభ్యులు, బీఎస్పీ నాయకుడు బాదావత్ ప్రతాప్ పాల్గొన్నారు. కాగా, ఈ విషయమై టేకులపల్లి ఎస్‌ఐ భూక్యా శ్రీనివాస్‌ను వివరణ కోరగా బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేయడమే కాక బాలిక జడ్జి ముందు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా విచారణ జరిపామే తప్ప ఎవరినీ వేధించలేదని తెలిపారు. ఇక బీఆర్‌ఎస్ నాయకుడు చీమల సత్యనారాయణ మాట్లాడుతూ మా బంధువు కుమార్తె విషయమై ఫిర్యాదు చేయగా పోలీసులు చట్టప్రకారం దర్యాప్తు చేస్తున్నారే కానీ ఇందులో తనకెలాంటి సంబంధం లేదని వివరించారు.

బస్సులో నుంచి దూకి ఒడిశా వాసి ఆత్మహత్య



సోదు మదిలై మృతదేహం

పాల్వంచరూరల్: వేగంగా వెళ్తున్న బస్సులో నుంచి దూకి ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగారంకాలనీ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నాగారంకాలనీ వద్ద బీసీయం రహదారిపై హైదరాబాద్ నుంచి ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరికి వెళ్తున్న స్లీపర్‌కోచ్ బస్సు కిటికీలో నుంచి మంగళవారం తెల్లవారుజామున సోదు మదిలై(20) ఒక్కసారిగా కిందకు దూకాడు. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడు హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా అతడి మానసిక స్థితి బాగా లేదని, అతడి సోదరుడితో తరచూ చనిపోతానని చెబుతుండేవాడని పోలీసులు తెలిపారు. దీంతో సోదు మదిలై సోదరుడి మిత్రుడు సంజయ్‌గోలోరి అతడిని హైదరాబాద్ నుంచి ఇంటికి తీసుకెళ్తున్న క్రమంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలాన్ని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ సందర్శించారు. మృతదేహాన్ని పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి సోదరుడు మంగరాజ్ మదిలై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్యంతో మహిళ...

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని మేదరబజారుకు చెందిన నాగలక్ష్మి (55) మంగళవారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. నాగలక్ష్మి కొంతకాలంగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారని, ఇటీవల నొప్పులు అధికమయ్యాయని, దీంతో ఆమె ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. నాగలక్ష్మి భర్త నాగేశ్వరరావు మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు, జేసీబీలు సీజ్

చర్ల: మండల కేంద్రంలోని రైస్‌పేట సమీపంలోని పంట పొలాల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న 8 ట్రాక్టర్లతో పాటు 2 జేసీబీలను మంగళవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తహసీల్దార్ భరణిబాబు కథనం ప్రకారం.. కొన్ని రోజులుగా మండలంలోని వివిధ గ్రామాలలో మట్టి, గ్రావెల్ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారంటూ ఫిర్యాదు వస్తుండటంతో తనిఖీలు చేపట్టామని తెలిపారు. మట్టి తవ్వుతున్న రెండు జేసీబీలు, ఎనిమిది ట్రాక్టర్లు కనిపించడంతో వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశామన్నారు. మండలంలో అక్రమ తవ్వకాలు, రవాణా చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

ఉత్తమ ఉద్యోగుల ఎంపిక



సీహెచ్ రాజశేఖర్



ఆర్.అశోక్‌కుమార్



బండి రాము



జి.రామారావు



జి.బావ్‌సింగ్



ఎస్‌కే అబ్దుల్ ఖుద్దూస్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా ఉత్తమ ఉద్యోగులను యాజమాన్యం మంగళవారం ప్రకటించింది. 74వ గణతంత్ర దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని ఇల్లెందు ఏరియాలో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసినట్లు ఏరియా జీఎం షాలేము రాజు తెలిపారు. ఈ నెల 26న ఉదయం 8 గంటలకు సింగరేణి 24 ఏరియా గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు కుటుంబ సమేతంగా ఉద్యోగులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఉద్యోగుల వివరాలిలా ఉన్నాయి..

- డాక్టర్ సీహెచ్ రాజశేఖర్, ఏరియా ఉత్తమ అధికారి (మెడికల్ సూపరింటెండెంట్ ఏరియా వైద్యశాల, ఇల్లెందు).
- ఆర్.అశోక్‌కుమార్, హెడ్ ఓవర్‌మెన్, కేఓసీ (ఉత్తమ సింగరేణియన్).
- బండి రాము ఫోర్‌మెన్ ఇన్‌చార్జ్, జేకే ఓసీ (ఉత్తమ ఉద్యోగి)
- జి.రామారావు, ఈపీ ఆపరేటర్(ఉత్తమ ఉద్యోగి)
- ఎస్‌కే అబ్దుల్ ఖుద్దూస్, ఈపీ ఆపరేటర్, కేఓసీ–2 (ఉత్తమ ఉద్యోగి).
- జి.బావ్‌సింగ్, జనరల్ మజ్దూర్, కేఓసీ (ఉత్తమ ఉద్యోగి).

కొత్తగూడెం ఏరియాలో ఉత్తమ కార్మికులు వీరే..

సింగరేణి(కొత్తగూడెం): గణతంత్ర దినోత్సవం సందర్భంగా 10 మంది ఉత్తమ కార్మికులను మంగళవారం ఏరియా అధికారులు ఎంపిక చేశారు. వారిలో ఉత్తమ సింగరేణియన్‌ను కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ముఖ్య అతిథుల చేతుల మీదుగా సన్మానించనుండగా మిగిలిన వారిని మాత్రం ఏరియాలో జరిగే గణతంత్ర దినోత్సవాల్లో ఏరియా జీఎం జక్కం రమేశ్ సన్మానించనున్నారు.

ఎంపికైన వారి వివరాలు

- ఉత్తమ సింగరేణియన్‌గా జె.శ్రీరామ్మూర్తి (ఈపీ ఎలక్ట్రీషన్ జేవీఆర్‌ఓసీ–2).
- ఉత్తమ అధికారిగా వి.వేమారెడ్డి (సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ జేవీఆర్‌ఓసీ–2)

ఉత్తమ కార్మికులు..

- బోడా సక్రు (సపోర్ట్‌మెన్, పద్మావతి ఖని).
- కె.రత్నభూషణ్ (జనరల్ మజ్దూర్, పద్మావతి ఖని).
- ఎం.శ్రీనివాసరావు (ఈపీ ఫిటర్ కం మెకానిక్, జీకేఓసీ).
- షేక్ యాకోబ్‌సాబ్ (డ్రిల్ ఆపరేటర్, జీకేఓసీ)
- మహమ్మద్ ఆసిఫ్ (హెడ్ ఓవర్‌మెన్ కిష్టారం
- మేడేపల్లి శ్రీనివాస్ (జనరల్ మజ్దూర్ కిష్టారం ఓసీ).
- రామంచి రాజయ్య (జనరల్ మజ్దూర్ జేవీఆర్ ఓసీ).
- అమర్ రషీద్ (ఈపీ ఆపరేటర్ జేవీఆర్ ఓసీ).

మణుగూరు ఏరియా ఉత్తమ ఉద్యోగులు వీరే..



డి.శ్రీనివాసరావు



జి.ససెంద్రకురూప్



బి.నాగేశ్వరరావు



కె.శ్రీనివాసరావు



పి.శ్రీనివాసరావు



కె.కృష్ణకుమార్



మహబూబ్ షేక్



ఎం.ఆంజనేయులు



ఎం.శ్రీనివాసరావు



జర్పుల చంద్రు

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసినట్లు ఏరియా జీఎం జి.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఏరియా ఉత్తమ ఉద్యోగుల వివరాలను వెల్లడించారు.

- ఉత్తమ అధికారిగా దేవసాని శ్రీనివాసరావు అడిషనల్ మేనేజర్ ఓసీ–4
- ఉత్తమ సింగరేణియన్‌గా జి.ససెంద్రకురూప్ ఈపీ ఆపరేటర్ పీకేఓసీ–2

ఉత్తమ ఉదోగ్యులు..

- బోనగిరి నాగేశ్వరరావు, వెల్డర్ కేసీహెచ్‌పీ
- కె.శ్రీనివాసరావు, జనరల్ మజ్దూర్ కేపీయూజీ
- పూజారి శ్రీనివాసరావు, బంకర్ చైన్ మజ్దూర్, మణుగూరు ఓసీ
- కృష్ణకుమార్ కల్యాణం, వెల్డర్ పీకేఓసీ–2
- మహబూబ్ షేక్, ఈపీ ఆపరేటర్ పీకేఓసీ–2
- ఎం.అంజనేయులు, సర్వేయర్ పీకేఓసీ–2
- ఎం.శ్రీనివాసరావు, ఫిట్టర్ ఏరియా వర్క్ షాపు
- జర్పుల చంద్రు, అసిస్టెంట్ సూపరింటెండెంట్, పర్సనల్ విభాగం.

28 నుంచి 'సాక్షి' ప్రీమియర్ లీగ్



డ్రా తీస్తున్న డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి, పక్కన సాక్షి ఉద్యోగులు

ఖమ్మం స్పోర్ట్స్: 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యాన ఈనెల 28 నుంచి 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ప్రారంభం కానుంది. వారంపాటు సాగే మ్యాచ్‌లకు సంబంధించి డ్రాను డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి మంగళవారం తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా 'సాక్షి' ఆధ్వర్యన ఔత్సాహిక క్రీడాకారులకు ప్రోత్సహించేందుకు టోర్నీ నిర్వహిస్తుండడం అభినందనీయమని తెలిపారు. అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్, సాక్షి బ్రాంచ్ మేనేజర్ గుడిమెట్ల మోహనకృష్ణ, బ్యూరో ఇన్‌చార్జ్ బొల్లం శ్రీనివాస్, టీవీ ప్రతినిధి పి.మహేంద్రకుమార్, డిప్యూటీ మేనేజర్(ఏడీవీటీ) ఎస్.నాగ శేషు, ఈవెంట్ మేనేజర్ బొడపట్ల వేణు, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ రాధారపు రాజు, ఆర్‌సీ ఇన్‌చార్జ్ నెల్లూరి ఉపేందర్, స్పోర్ట్స్ రిపోర్టర్ జుజ్జూరు ఉపేందర్‌తో పాటు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి, సీనియర్ క్రికెటర్లు జోజి చాకో, ఎం.డీ.ఫారుఖ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, జూనియర్స్ విభాగంలో 23, సీనియర్స్ విభాగంలో 26 జట్లు పాల్గొనే టోర్నీ నిర్వహణకు ఇప్పటికే కమిటీలను ఏర్పాటుచేయగా, నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయని నిర్వాహకులు వెల్ల డించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786665]

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 99 12 72 1888 [B-1197733]

ఆయుర్వేదం

■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడను. సంప్ర: 9603055647, 7995392747 [G-932]

Wanted

■ Wanted ITI Electricians 30 Members Worker Place Vijayawada Contact Our Office Haridra Solutions Burhanpuram, Khammam. Cell : 8977900255. [M-1190510]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K. Ph: 7569955551/ 9848571888 [H-786823]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776049]

■ డైరెక్ట్ జాబ్! Hyd లో 5స్టార్ హోటల్స్ లో క్యాటరింగ్ బాయ్స్ పరిశ్రమలలో ప్యాకింగ్ బాయ్స్ సాలరీ: 25–35వేలు, రూమ్+మీల్స్ కలదు. ఫోన్ : 9542442263. [H-792786]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
ఖమ్మం - 9705444182
9010299957
కొత్తగూడెం-9010223783
భద్రాచలం - 9951602914

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.